"ఇచ్చేవాడి కంటే పుచ్చుకునే వాడే గొప్ప. నేను మా వాళ్ళకిచ్చిందాని వల్ల ఇప్పుడు నాకు ఒరిగేదేమీ లేదు. నా నించి దానం పుచ్చుకున్న అతని వల్లే నేను విజ్ఞతగా పుణ్యాన్ని సంపాదించుకునే అవకాశం, తద్వారా ఉత్తమ గతి పొందే అవకాశం నాకు కలిగాయి. నాకా గొప్ప అవకాశాన్ని కల్పించినందుకు కృతజ్ఞతగా నేను అతన్ని చూడాలనుకుంటున్నాను." జవాబు చెప్పాడా ధనవంతుడు.

## 189. చెడు-మంచి

హైద్రాబాద్‌లోని ఇద్దరు బ్రాహ్మణులకి ఆస్త్మా వ్యాధి వుంది. చేపమందు తింటే ఆ రోగం నయం అవుతుందని వాళ్ళిద్దరూ విన్నారు. అయితే ఇద్దరూ పూర్తిగా శాకాహారులు. ఒకడు చేపని మింగడం విషయంలో సంశయించాడు. ఇంకొకడు తను ఇంకా క్షీణిస్తే తన మీద ఆధారపడ్డ భార్యా పిల్లలు ఇబ్బందికి గురవుతారని వెళ్ళి ఆ చేపమందుని మింగాడు. దాంతో అతని ఆస్త్మా పోయింది.

పాపభీతి గల మొదటివాడు చేప మందుని తినకపోవడంతో ఆ రోగం అధికం అయి ఓ తెల్లవారుఝామున ఊపిరాడక మరణించాడు. అతని భార్యా పిల్లలు అనాధలై అనేక కష్టాలకి గురయ్యారు.

**నీతి:** మంచి పని కోసం కొంత చెడు చేయాల్సి వస్తే అది పాపం కాదు. కాని చెడు కోసం చేసే ప్రతీ మంచి పనీ పాపమే అవుతుంది.

## 190. ప్రవచన లక్ష్యం

ఓ గురువుకి ఒంట్లో బాగాలేకపోవడంతో అతని శిష్యుడు ఆ రోజు ఆయన బదులుగా ప్రవచనం చెప్పాల్సి వచ్చింది. అతను రాసుకున్న ప్రవచనం కాగితాన్ని గురువుకి ఇచ్చి అడిగాడు.

"ఏమైనా మార్పులు, చేర్పులు సూచిస్తారా?"